# పెద్దల సబ్బాతుబడి పాఠములు

# పరలోకము మరియు భూమి ఐక్యపర్చబడెను ఫిలిప్పీయులకు మరియు కొలొస్సయులకు వ్రాసిన పత్రికలలో యేసును గూర్చి నేర్చుకొనుడి

## మొదటి త్రైమాసం-2026



**జనవరి, ఫిబ్రవరి, మార్చి -2026**


గ్రంథకర్త

**క్లింటన్ వాహ్ లెన్**

అనువాదం

**చింతా ప్రకాష్**

6వ పాఠం జనవరి 31- ఫిబ్రవరి 6

# మనము రక్షించబడుటకు యేసునందు మాత్రమే నమ్మకముంచవలెను

## సబ్బాతు మధ్యాహ్నము జనవరి 31

**ఈ వారమునకు చదువ వలసిన వచనములు : ఫిలిప్పీ 3:1-3; ఫిలిప్పీ 3:4-6; యోహాను 9; ఫిలిప్పీ 3:9; ఫిలిప్పీ 3:10-16.**

**కంఠతవచనం : "ఏవిధముచేతనైనను మృతులలోనుండి నాకు పునరుత్థానము కలుగవలెనని, ఆయన మరణ విషయములో సమానానుభవముగలవాడనై, ఆయనను, ఆయన పునరుత్థాన బలమును ఎరుగు నిమిత్తమును, ఆయన శ్రమలలో పాలివాడగుట ఎట్టిదో ఎరుగు నిమిత్తమును సమస్తమును నష్టపరచుకొని వాటిని పెంటతో సమానముగా ఎంచుకొనుచున్నాను (ఫిలిప్పీ 3:10,11).**

మనయెడల దేవుని యొక్క ప్రేమ మరియు ఆయన అనుగ్రహించు క్షమాపణ వలన మనము రక్షింపబడుదుమని నీవు నిజముగా నమ్ముచున్నావా? ఈ బైబిలు సత్యమును నమ్మُటకు కొంతమందికి చాలా కష్టమనిపిస్తుంది. వారిని రక్షించుటకు దేవుని యొక్క కృప సరిపోదని వారు నమ్ముదురు. దేవుడనుగ్రహించు రక్షణ వరమునకు తోడుగా మన మంచి ప్రవర్తన కూడా దానికి జత చేసినప్పుడు మాత్రమే మనము రక్షింపబడుదుము అని వారి నమ్మకము. పౌలు జీవించిన కాలములో ఒకడు రక్షింపబడవలెనంటే తప్పనిసరిగా సున్నతి పొందవలెనని కొంతమంది క్రైస్తవులు నమ్మేవారు. సున్నతి పొందడమంటే పురుషుని జననేంద్రియము యొక్క గోప్యాంగ చర్మమును త్రుంచి వేయవలెను. బైబిలు కాలములలో పురుషులు సున్నతి చేయబడుట అనగా అదొక ప్రత్యేకమైన చిహ్నముగా పరిగణించబడుటే కాకుండా, యూదులనే వారు దేవునికి చెందినవారు, ఒక ప్రత్యేక జనాంగముగా గుర్తింపు పొందిన వారని ఆ కార్యము సూచించెను. యేసు మృతులలో నుండి లేచిన తరువాత ఈ సున్నతికి సాదృశ్యముగా బాప్తిస్మము తీసుకొనుట ద్వారా సున్నతి పొందినదానితో సమానముగా ఎంచబడెను. అయితే ఈ భావమును అంగీకరించుటకు కొంతమంది యూదయ క్రైస్తవులు అభ్యంతరము లేవనెత్తిరి. వారి నమ్మకము ప్రకారము యూదేతరులు క్రైస్తవ మతమును స్వీకరించినపుడు వారు తప్పనిసరిగా సున్నతి పొందవలసియున్నదని వాదించిరి. అప్పుడు మాత్రమే దేవుడు వారిని రక్షిస్తాడు అని నమ్మారు. ఈ అబద్ధపు వాదనను వ్యతిరేకిస్తూ పౌలు చాలా తీవ్రముగా వారిని హెచ్చరించెను. "మనము నిజముగా దేవుని ప్రజలమైయున్నాము. ఎవరో మనలను సున్నతి చేసినందుకు కాదు గాని దేవుని ఆత్మ యొక్క నడుపుదల క్రింద మనము దేవునిని ఆరాధించుచున్నాము. ప్రభువైన యేసుక్రీస్తు

మనకు చేసిన దానిని బట్టి దేవునికి వందనములు చెల్లించుచున్నాము. అవును, మనము మానవ భావముల వలన రక్షింపబడమని మనకు తెలుసు" (ఫిలిప్పీ 3:3)

– ఫిబ్రవరి 7 సబ్బాతు దినమునకు ఏర్పాటు చేయబడిన సబ్బాతుబడి పాఠమును చదువుటకు సిద్ధపడుడి.

**ఆదివారం** **ఫిబ్రవరి 1**

## ప్రభువునందు ఆనందించుట (ఫిలిప్పీ 3:1-3)

**ఫిలిప్పీ 3:1-3 చదువుడి. ఈ వాక్యములలో పౌలు ఇచ్చిన హెచ్చరికలు ఏమిటి? యేసును వెంబడించే వారిని గూర్చి పౌలు ఏమి చెప్పెను?**

పౌలు తాను వ్రాసిన పత్రికలో ఉన్న ప్రాముఖ్యమైన అంశమును గూర్చి ఆయన మాట్లాడుచున్నట్లు ఈ వాక్యములు తెలియజేయుచున్నవి. "ఆనందించుట" అనే అంశము ప్రధానముగా అందులో ఉన్నది. ఆనందముగా జీవించుట గురించి పౌలు అనేక కారణములను చూపించాడు. మనము ఆనందముగా ఉండాలంటే ముఖ్యముగా మనలను మనము నమ్ముకొనకుండా యేసునందు మన నమ్మకమును ఉంచాలి. "ఎందుకనగా శరీరమును ఆస్పదము చేసుకొనక దేవుని యొక్క ఆత్మవలన ఆరాధించుచు మనము క్రీస్తుయేసు నందు అతిశయపడుదుము" (ఫిలిప్పీ 3:3).

ఇంకా పౌలు మాట్లాడుచు అన్ని విషయాలలో జాగ్రత్తగా ఉండమని విశ్వాసులను హెచ్చరించుచున్నాడు. ఈ హెచ్చరిక చాలా తీవ్రమైనదిగా ఇచ్చెను. బైబిలంతటిలో వేరే చోట మరెక్కడ ఇటువంటి హెచ్చరిక ఇవ్వలేదు. పౌలు ఏ ప్రమాదము గూర్చి మాట్లాడుచున్నాడో ఫిలిప్పీలో ఉన్న క్రైస్తవ సంఘమునకు బాగుగా తెలుసు. పౌలు వేర్వేరు మూడు విషయాలను గూర్చి హెచ్చరికలను ఇవ్వడము లేదని మీకు కనిపిస్తున్నదా? పౌలు ఒక్క విషయమును గూర్చే మూడు వేర్వేరు సమయములలో హెచ్చరించాడు. మూడు విధాలుగా అబద్ధ బోధకులతో కూడిన గుంపును గురించి పౌలు హెచ్చరించాడు.

బైబిలు తరచుగా దుర్మార్గులైన ఇశ్రాయేలీయులను "కుక్కలు" అని సంబోధించుటను గమనించవచ్చును (ఫిలిప్పీ 3:2; కీర్తన 22:16; యెషయా 56:10; మత్తయి 7:6; 2పేతురు 2:21,22 తో పోల్చి చూడుడి) అబద్ధ బోధకులు ఈ గుంపులో చేర్చబడినారు. ఈ అబద్ధ బోధకులు దుర్మార్గులైన పనివారని పౌలు చెప్పుచున్నాడు. "దుష్టులైన పని వారి విషయమై జాగ్రత్తగా ఉండమని ఫిలిప్పీయులకు హెచ్చరించెను (ఫిలిప్పీ 3:2) ఎందువలన జాగ్రత్తగా ఉండాలి, ఈ అబద్ధ బోధకులు క్రైస్తవులైన యూదేతరులను యూదులు ఏవిధముగానైతే కొన్ని ఆచారాలను గైకొంటారో ఆవిధముగా యూదేతరులను కూడా యూదుల ఆచారాలను గైకొనమని బోధిస్తున్నారు. యూదేతరులు సంఘ సభ్యులుగా ఉండగోరిన యెడల వారు యూదుల వలె సున్నతి పొందవలెనని అప్పుడు మాత్రమే సంఘ సభ్యులుగా అంగీకరింపబడుదురని బోధించిరి. యెరూషలేము సమావేశములో తీసుకున్న నిర్ణయమునకు యూదయ బోధకుల బోధ విరుద్ధముగా ఉన్నది (అపొ.కా. 15 చదువుడి)

యేసునందు ఆనందించుడని పౌలు తన పత్రికలను చదివే విశ్వాసులను కోరాడు. వారి ఆనందము, వారి శ్రమలలో సహాయపడుతుంది. వారు యేసునందు ఆనందించుట ద్వారా, వారి ఆనందము అబద్ధ బోధలను ఆపగలుగుతుంది (ఫిలిప్పీ 3:1ని ఫిలిప్పీ 4:4తో పోల్చి చూడుడి).

మన జీవితాలలో మనము ఆనందముగా ఉండుట కనుగొనవలెను. నిజమైన ఆనందము సంతోషము ఏవిధముగా పొందగలమో బైబిలు బోధిస్తుంది : 1.మనము దేవుని యొక్క కృపను అంగీకరించాలి (కీర్తన 31:7) 2. దేవునియందు నమ్మకముంచు (కీర్తన 5:11) 3.దేవుని దీవెనలను అంగీకరించు (కీర్తన 9:14) 4.ఆజ్ఞలకు విధేయత కలిగి జీవించు (కీర్తన 19:14) 5. విశ్రాంతి దినమును గైకొనవలెను (యెషయ 58:13,14) 6.బైబిలును నమ్ముము (కీర్తన 119:162) 7. పిల్లలకు ప్రభువును వెంబడించమని బోధించాలి (సామె. 23:24,25).

**మనము ఏవిషయాలను బట్టి ఆనందించగలము?**

**సోమవారం** **ఫిబ్రవరి 2**

## పౌలు యొక్క గతము (ఫిలిప్పీ 3:4-6)

అనేకమంది క్రైస్తవులు వారి జీవితాలను గూర్చి రెండు విధాలుగా మాట్లాడుదురు. యేసు వారి స్వకీయ రక్షకునిగా అంగీకరించకపూర్వము వారి జీవితాలు ఏవిధముగా ఉండెడివి? యేసును రక్షకునిగా అంగీకరించిన తరువాత వారి జీవితాలు ఏవిధముగా ఉన్నవి అని వేర్వేరు అనుభవాలను గూర్చి మాట్లాడుదురు. పౌలు కూడా ఫిలిప్పీ 3లో అదేవిధముగా తన జీవితము గూర్చి మాట్లాడెను. కొన్ని సమయాలలో యేసును వారి రక్షకునిగా అంగీకరించని వారిని కూడా మనము "మంచివారు" అని పిలుస్తుంటాము. అనేకమంది దృష్టిలో క్రైస్తవులు కానట్టి మనుష్యులను మంచివారుగానే భావిస్తుంటాము. అయితే వారి జీవితాలను దేవుని ధర్మశాస్త్రముతో పోల్చి చూసినపుడు మంచివారనబడే వారెవరూ ఉండరు. చివరికి క్రైస్తవులు కూడా మంచివారుగా పిలువబడుటకు సరిపోరు.

**ఫిలిప్పీ 3:4-6లో పౌలు తన గతమును గూర్చి లేక పాతజీవితాన్ని గూర్చి అనేక విషయాలు మాట్లాడియున్నాడు. గత కాలములో ఆ విషయాలను బట్టి అతని హృదయము గర్వముతో నిండుకొనెను. ఆ విషయాలు ఏమిటి? ఇప్పుడు నీ గత జీవితములోను ఉన్న మంచి విషయాలేమిటి?**

రెండు గుంపులకు చెందిన ప్రజలను గూర్చి పౌలు పోల్చి చూపిస్తున్నాడు. అబద్ధ బోధకులు మరియు యూదేతర క్రైస్తవులు. అబద్ధ బోధకులు నిజము కానట్టి విషయాలను బోధిస్తున్నారు. యూదులు కానట్టి క్రైస్తవులు యేసు వారిని రక్షిస్తాడని పరిపూర్ణముగా నమ్ముచున్నారు. దేవుని యొద్ద నుండి ఉపకారమును లేక దేవుని అనుగ్రహమును

పాపక్షమాపణయు లభించుటకు వారి స్వనీతి మీద ఆధారపడరు (హెబ్రీ 6:1 మరియు హెబ్రీ 9:14 చదివి రోమా 2:25-29తో పోల్చి చూడుడి) పౌలు గత జీవితము గొప్ప పేరు ప్రతిష్టలతో నిండినది. అయితే వాటిలో ఏ ఒక్క విషయము ఆయనను రక్షించలేదు. ఘోరమైన విషయమేమిటంటే అతని గత జీవితములోని విషయాలన్నియు, ఆయన హృదయమును గర్వముతో నింపినవి. ఆయన జీవితములో యేసు యొక్క అవసరమును తెలుసుకొనుటకు కొంతకాలము గ్రుడ్డివాడుగా ఉన్నాడు.

పౌలు యొక్క పాత జీవితము ఏవిధంగా ఉండేదో ఒకసారి చూద్దాము. ఆయన ఇశ్రాయేలీయుడుగా జన్మించెను. బెంజమీను గోత్రమునకు చెందిన కుటుంబములో జన్మించెను. అనేక ప్రముఖ పట్టణాలు ఈ కుటుంబ గోత్రమునకు చెందినవే. పౌలుకు హెబ్రీ భాష తెలుసు. పేరుగాంచిన 'గమలీయేలు' యొద్ద ధర్మశాస్త్ర సంబంధమగు విద్యను అభ్యసించాడు (అపో.కా. 22:3; 26:4,5) పౌలు యూదులకు ఆధ్యాత్మిక నాయకులుగా ఉన్న పరిసయ్యుల వర్గమునకు చెందిన పరిసయ్యుడు. అందుచేత పౌలుకు పది ఆజ్ఞల గూర్చి తెలుసు. యూదులు ఏవిధంగా ధర్మశాస్త్రమునకు విధేయలుగా ఉండేవారో అనే విషయము కూడా తెలుసు.

పౌలు ధర్మశాస్త్రాన్ని బహుగా ప్రేమించాడు. యూదుల జీవిత విధానమును మరియు ధర్మశాస్త్రమును క్రైస్తవులు గైకొనుట లేదనే అభిప్రాయముతో వారి మీద దాడులు చేసేవాడు. ధర్మశాస్త్రమునకు లోతైన భావముందని గ్రహించాడు. ధర్మశాస్త్రమునకు ఆయన మేలు చేయుటకు బదులు ఆయననుండే ఎక్కువ కోరుతుందని తెలుసుకున్నాడు. యేసు లేకుండా ధర్మశాస్త్రమును ఉల్లఘించి దోషియైయున్నాడని అర్థం చేసుకున్నాడు. (రోమా 7:7-12ను మత్తయి 5:21,22,27,28తో పోల్చుడి. ధర్మశాస్త్రమును గూర్చి యేసు, పౌలు ఏమి చెప్పిరి? ఎందువలన యేసునందు విశ్వాసముంచి (ఫిలిప్పీ 3:9) తేనే తప్ప, ధర్మశాస్త్రమును గైకొనుట వలన పరిశుద్ధులముకాలేము? ఈ విధముగా చూడండి. ఎంత బాగుగా ధర్మశాస్త్రమును గైకొనగలము? రక్షింపబడుటకు యేసు అవసరమనే విషయానికి నీ జవాబు ఏమిటి?

**మంగళవారం** **ఫిబ్రవరి 3**

## పరిగణలోనికి తీసుకొనవలసిన విషయములు (యోహాను 9)

నిన్నటి దిన పాఠములో చూచినట్లు అనేక విషయాలలో పౌలు చాలా గర్వముతో నింపబడ్డాడు. అటువంటి విషయాలు ఆయన హృదయములో గూడు కట్టుకొని యుండుటచేత, విశ్వాసము కలిగియుండుటకు అవకాశములేకపోయినది. సౌలుకు యేసు యొక్క అవసరత లేదన్నట్లు ఆ విషయాలు అతనిని గ్రుడ్డివానిగా చేసెను.

పౌలు యేసును అంగీకరించిన తరువాత ఆ విషయాలను వేరొక దృక్పథములో చూడగల్గెను. ఆయన ఒక యూదుడు కాబట్టి ఇంతకు పూర్వమే గర్వముగా ఉండేవాడు.

ఇప్పుడు గర్వము తొలగిపోయి, పరలోకములోని దేవుని యొక్క కుటుంబములో సభ్యుడని గర్వముగా ఉన్నాడు.

యేసు పరము నుండి ఈ భూమి మీదకు వచ్చెను. అందుచేత యేసు పరలోకమును గురించి మనతో మాట్లాడెను. ఈ భూమి మీద మనము ఆధ్యాత్మిక ప్రమాదములో ఉన్నామని యేసుకు తెలుసు. హృదయములో ఉన్న పాపమును తీసివేయుట కొరకు యేసు ఈ లోకమునకు వచ్చెను. మనలను పరిశుద్ధులుగా చేయుటకు ఆయన వచ్చెను. అప్పుడు పరలోకములోని సింహాసనము ప్రక్కన కూర్చొనగలుగుదుము. ఈ జీవితములో ఉన్న అనేక వ్యర్ధ విషయాల వలన ఎదురయ్యే ప్రమాదముల గూర్చి యేసు మనలను హెచ్చరిస్తున్నాడు. పరలోకము గూర్చి ఆలోచించుటకు యేసు మనకు సహాయము చేస్తాడు. అప్పుడు వ్యర్ధ విషయాలపై మనస్సును కేంద్రీకరించక తలాంతులు, సమయము, జీవితము వృధాకాకుండా ప్రవర్తించగలుగుదుము. –ఎలెన్ జివైట్, ఎడ్వంటు రివ్యూ మరియు సబ్బాతు హెరాల్డు, జూలై 1,1890.

నూతన నిబంధన కాలములో చాలా వేగముగా పౌలు కీర్తి ప్రతిష్టలతో ప్రసిద్ది కెక్కెను. అయితే పౌలు దమస్కు మార్గము వెంబడిపోవుచున్నపుడు యేసు చూచెను. (అపొ.కా. 9) ప్రకాశించుచున్న మహిమతో యేసు కప్పబడియుండెను. యేసును చూచినపుడు గ్రుడ్డివాడయ్యాడు. అతడు గ్రుడ్డివాడుగా ఉన్నపుడు, యేసును గూర్చి సత్యమును చూడగలిగెను.

**యోహాను 9లో గ్రుడ్డివాడు యేసును చూడగలిగిన వృత్తాంతము వివరిస్తున్నది. ఈ భూమి మీదికి యేసు ఎందుకు వచ్చెనో వివరించాడు. "అప్పుడు యేసు చూడని వారు చూడవలెను. చూచువారు గ్రుడ్డివారు కావలెను, అను తీర్పు నిమిత్తము నేనీ లోకమునకు వచ్చితినని చెప్పెను" (యోహాను 9:39) ఈ వాక్యము యేసు ఉద్దేశాన్ని ఎట్లా చెప్పెను? ఈ సూత్రమునకు ఏవిధమైన విధేయత చూపగలము?**

నిత్యజీవము కన్నా ముఖ్యమైనది వేరొకటి ఉంటుందా? లేదు. విచారమేమంటే మన భావములు, విషయాలు మనలను బైబిలు సత్యము గ్రహించకుండా గ్రుడ్డి వారినిగా చేస్తున్నాయి. ఈ జీవిత విషయాలు (మత్తయి 13:22; లూకా 4:5,6; 1యోహాను 2:16) మనము అనుమతిస్తే హృదయాలను, మనస్సులను ఆ తలంపులతో నింపివేస్తాయి. అందుచే దేవుని దృష్టిలో విలువైన విషయాలలో మన హృదయాలను మనస్సులను నింపుకొనాలి. అవేమిటి? మన హృదయాలలో మనము కూడా యేసు వలె మార్పు చెందాలి. దేవుని కొరకు మనుష్యులను రక్షించుట కొరకు మనము దేవునితో కలిసి పనిచేయాలి.

**బైబిలు సత్యమును గ్రహించకుండా ఈ లోక సంబంధమైన విషయాలు నిజముగా రక్షణకు ప్రాముఖ్యమైన విషయాలను కనుగొనకుండా మనలను గ్రుడ్డి వారినిగా చేయగలవు. నిజముగా పరిగణలోనికి తీసుకొనవలసిన విషయాలపై మనము దృష్టి పెట్టినట్లు ఏవి మనకు సహాయపడును?**

బుధవారం ఫిబ్రవరి 04

## క్రీస్తునందు విశ్వాసము (ఫిలిప్పీ 3:9)

దమస్కు మార్గములో పౌలుకు ఆశ్చర్యపడే ఒక అనుభవము కలిగెను. అది అతని పాత జీవితమును వదిలి యేసునందు నూతన జీవితమును ఆరంభించుటకు నాంది పలికెను. "నిశ్చయముగా నా ప్రభువైన యేసును గూర్చిన అతి శ్రేష్టమైన జ్ఞానము నిమిత్తమై సమస్తమును నష్టముగా ఎంచుకొనుచున్నాము. క్రీస్తును సంపాదించుకొని ధర్మశాస్త్రములపైన నా నీతినిగాక, క్రీస్తునందలి విశ్వాసమువలనైన నీతి అనగా విశ్వాసమును బట్టి దేవుడు అనుగ్రహించు నీతిగలవాడనై ఆయనయందు అగపడు నిమిత్తమును" (ఫిలిప్పీ 3:8,9)

**యేసుతో జత చేయబడాలని పౌలు కోరుచున్నాడు. ఆవిధముగా ఆలోచించుటలో పౌలు యొక్క ఉద్దేశము ఏమైయున్నది? (ఎఫెసి 1:4; 2కొరింథి 5:21; కొలొస్స 2:9 మరియు గలతి 2:20 చదువుడి.**

పౌలు యొక్క మాటలను వివరించుటకు అనేకమంది ప్రయత్నించారు. మంచి వివరణ, పౌలు తాను ఎఫెసీయులకు వ్రాసిన పత్రికలోనే ఇవ్వబడినది. ఈ పత్రికలో పౌలు దేవుని యొక్క రక్షణ ప్రణాళిక గూర్చి మాట్లాడుచున్నాడు. "ఈ సంకల్పమును బట్టి ఆయన పరలోకములో ఉన్నవే గాని, భూమిమీద ఉన్నవే గాని, సమస్తమును క్రీస్తునందు ఏకముగా సమకూర్చవలెనని తనలో తాను నిర్ణయించుకొనెను" (ఎఫెసి 1:10). ఆరంభమునుండి దేవుని యొక్క ప్రణాళిక ప్రకారము పరలోకంలోని కుటుంబము మరియు మానవ కుటుంబము కలిసి ఉండుటకు ఈ రెండు కుటుంబాలను కలపాలనెడి ప్రణాళిక దేవునిదైయున్నది. ఆ ప్రణాళిక ఏవిధముగా సంభవించనైయున్నదో పౌలు వివరించాడు. "మనము క్రీస్తుకు చెందిన వారము కాబట్టి దేవుడు క్రీస్తుకును మనకును మధ్య ఉన్న వివాదమును సరిచేసి ఆయన మనలను తన సొంత ప్రత్యేక జనాంగముగా చేసుకొనును, మన మీద పాపమునకున్న అధికారమును తుడిచి వేసి మనలను స్వతంత్రులనుగా చేయును (1కొరింథి 1:30)

క్రీస్తు యేసునందు నిలిచి యుండుట అంటే అర్ధమేమిటి? క్రీస్తు యేసునందు ఉన్నపుడు, తిరిగి జన్మించిన వారమై యుందుము. దేవుడు మనలను జ్ఞానవంతులనుగా చేయును. పవిత్రులనుగా చేయును. పరలోకము కొరకు సిద్ధపర్చును. చివరగా రెండవ రాకడ సమయములో యేసు మన దేహములను మార్పు చేయును. మన కొరకు యేసు సమస్తమును చేయును, మన హృదయములలోనికి యేసును అంగీకరించితే అవసరమైనవన్నియు కలిగియుందుము.

**ఫిలిప్పీ 3:9 చదువుడి. ఈ వాక్యములో పౌలు రెండు విషయాలు పోల్చెను అవి**

**ఏమిటి? ఈ భావమును గుర్తు పెట్టుకొనుట ఎందుకు అంత ప్రాముఖ్యము?**

రక్షణను అనుగ్రహించకలిగే విశ్వాసము యేసు మనకు కలుగజేయును. యేసునందుంటే ఆయన మనలో జీవిస్తాడు (గలతీ 2:20) ఆయనకు విధేయత చూపించుటకు సహాయపడును. ఆయనను నమ్మినచో ఆయన యొక్క విశ్వాస్యత మనకు జీవమును అనుగ్రహించును.

## గురువారం ఫిబ్రవరి 5

## యేసును ఎరుగుట (ఫిలిప్పీ 3:10-16)

**ఫిలిప్పీ 3:10-16 చదువుడి. ఈ వాక్యాలలో పౌలుకున్న భావములు ఏమిటి?**

నిజముగా మనము యేసును ఎరుగుటకన్నా ప్రాముఖ్యమైన విషయము మరొకటి ఉండదు. యేసును తెలుసుకున్నపుడు ఆయన మనలను అంగీకరిస్తాడు (మత్తయి 7:21-23 చదువుడి) అందుచేత యేసును ఏవిధముగా తెలుసుకొనగలము? బైబిలు యేసు గూర్చి చెపుతుంది కాబట్టి యేసు ఎవరో మనము తెలుసుకొనగలుగుచున్నాము. బైబిలు చదివినపుడు, బైబిలు బోధిస్తున్న సత్యము ప్రకారము జీవిస్తే యేసును తెలుసుకుంటాము. ఆదినములలో యేసును వెంబడించిన వారు ముఖాముఖిగా ఆయనను చూచి తెలుసుకున్నట్లు నేడు మనము యేసును చూచి తెలుసుకొనలేము. అయితే వారికి ఏమి సంభవించినదో చూడుడి. ఆయన మాటలను వారు అర్ధము చేసుకొనలేదు. అందుచేత మనలను నడిపించుటకు యేసును మనము అర్ధము చేసుకొనుటకు పరిశుద్ధాత్మ సహాయము అవసరము. (యోహాను 16:13) యేసును ఎంత ఎక్కువ తెలుసుకుంటే ఆయనకు అంత దగ్గర చేరుకుంటాము. మృతులలో నుండి మనము తిరిగిలేచుటకు యేసు సహాయము చేయును (ఫిలిప్పీ 3:10,11) అంతట ఆయనలో ఒక నూతన జీవితమును జీవింతుము (రోమా 6:4).

యేసు శ్రమలు పడినట్లు మనము కూడా శ్రమలు పడితే హృదయములో మనము కూడా యేసుకు సమీపముగా వస్తాము. (ఫిలిప్పీ 3:10) ప్రతి పరీక్ష కూడా కష్ట కాలము, బాధకరమైన అనుభవము యేసు మన కొరకు ఏవిధంగా శ్రమలను అనుభవించెనో గ్రహించుటకు మన అనుభవాలు సహాయపడును. అప్పుడు యేసును గూర్చి మనలను రక్షించుట కొరకు ఆయన యొక్క ప్రణాళికను గూర్చి బాగుగా అర్ధము చేసుకొనగలుగుదుము.

పౌలు మన అనుభవాలను యేసు యొక్క అనుభవముతో పోల్చి చూసినపుడు అవి ఒక పరుగు పందెము వలె కనిపించును. "క్రీస్తు యేసునందు దేవుని ఉన్నతమైన పిలుపునకు కలుగు బహుమానమును పొందవలెనని, గురి యొద్దకే పరుగెత్తుచున్నాను" (ఫిలిప్పీ 3:14) యేసు మరణించెను. మృతులలో నుండి లేచెను. పరలోకమునకు ఆరోహణమాయెను. అదే రీతిగా అదే బహుమానమును అనగా "నిత్యజీవమును" అంగీకరించుటకు దేవుడు

మనలను ఆహ్వానించుచున్నాడు.

అవును నిజమే. యేసు మనలను మార్పు చేసే దినము కొరకు నిరంతరము వేచి చూస్తున్నాము. (ఫిలిప్పీ 3:21) అయితే ఆయనను తెలుసుకొని అనుదినము ఆయనను మన హృదయములలో కూడా యేసువలె ఆహ్వానిస్తాము. అపుడు సాధ్యమైనన్ని విషయాలలో కూడా యేసువలె ఉండగలము. అన్నిటికన్నా మించి ఈ అనుభవాన్ని పొందుకోవాలని పౌలు కోరుచున్నాడు. అట్టి అనుభవము కోరుకుంటే మనము పరుగు పందెములో పాల్గొనుచున్నట్లు ప్రవర్తించవలెను. పందెములో పరుగెత్తేవారు, వారి వెనుక ఎవరున్నారో తెలుసుకొనుటకు ప్రయత్నించరు. వెనుతిరిగి చూడరు. గురిచేరేవరకు పరుగెడుతునే ఉందురు తప్ప వేరే విషయాలపై దృష్టి పెట్టరు. పందెము అంతములో ఎదురుచూచుచున్న బహుమానము పైనే ఆలోచిస్తూ ఉంటారు.

మీరు చేసిన పాపములు, పొరపాట్ల వైపు ఎందుకు వెనుకకు తిరిగి చూడక పోవుట చాలా ముఖ్యము. ఇప్పుడే యేసునందు దేవుడు మీకు వాగ్దానము చేసిన ప్రతి విషయము కొరకు మీ ముందున్న వాటి కొరకు ఎందుకు చూడవలెను?

## శుక్రవారం ఫిబ్రవరి 6

## అదనపు అధ్యయనం

"యేసు కనిపించినట్లు నీవు కూడా కనబడాలనుకొనుచున్నావా? నీ హృదయములో దేవునితో జీవించాలని కోరుచున్నావా? నీవు దేవునికి పరిచర్య చేయాలనుకున్నట్లయితే, దేవునిని సేవించాలనుకున్నట్లయితే, నీకు కలిగినది యావత్తు యేసుకు సమర్పించుకో. నీవు చేసే ప్రతి పని ఆయనను ఘనపరచే విధముగా చేయవలెను. నీ హృదయమును యేసుకు సగభాగమునే సమర్పించుకున్న యెడల అటువంటి హృదయమును యేసు అంగీకరించడు. ఆయనకు నీ పూర్ణ హృదయము కావలెను. ఆయన కొరకు నీకున్న సమస్తమును అర్పించుకొనవలెను. బైబిలును చదవండి. బైబిలు యొక్క అర్థమేమిటో నేర్చుకోండి. "బైబిలు బోధనలకు విధేయులుగా జీవించండి. ఈ విషయాలన్నింటిని నెరవేర్చినప్పుడు నీవొక మంచి క్రైస్తవుడుగా మార్పు చెందెదవు. అనుదినము దేవుడు నీతో పనిచేయును. ఆయన నిన్ను పవిత్రుని గాను, పరిపూర్ణునిగాను చేయును. కాలము సంపూర్ణమైనప్పుడు చివరి పరీక్షలో ఉత్తీర్ణులగుటకు దేవుడు నీకు సహాయము చేయును. ప్రతిదినము ప్రతి క్రైస్తవుడు ఆశ్చర్యకరమైన ప్రయోగములో భాగమైయుండును. పాపులకొరకు యేసును గూర్చి శుభవార్త భూమి మీద మరియు పరలోకములోను ఏమి చేయునో ప్రతి వారికి మనము చూపించగలుగుదుము" –ఎలెన్ జి వైట్ అపొస్తలుల కార్యములు పుట 483.

యేసు తిరిగి వచ్చే సమయమైనదని మనము వేచి చూచూచుండగా యేసువైపు చూడమని మనము అందరికీ చెప్పాలి. ఈ భూమి మీద ఉన్న ప్రతి మనిషికి దేవుని యొక్క కడవరి కృపావర్తమానమును అందించవలెను. ప్రజలకు ఈ వర్తమానమును అందించాలి. ప్రజలకు ఈ వర్తమానము దేవుని యొక్క ప్రేమను చూపించును. దేవుని పిల్లలముగా, మన జీవితాలు దేవుని మహిమను ప్రదర్శించవలెను. మన మంచి కొరకు దేవుని యొక్క ప్రేమ, క్షమాపణ గుణము మనలను ఏవిధంగా రక్షించెనో చూపించినప్పుడు, దేవుని మహిమను చూపించుచున్నామని అర్థం.

యేసు వెలుగైయున్నాడు. మనము చేసే ప్రతి పనిలోను, పలికే ప్రతి మాటలోను ఆయన వెలుగు ప్రకాశించాలి. అప్పుడు మన మాటలు, ప్రవర్తన పవిత్రముగ ఉండును - ఎలెన్ జి వైట్, క్రీస్తు యొక్క ఉపమాన పాఠములు పుటలు 415,416.

## చర్చించుకొనుటకు ప్రశ్నలు

1. ప్రభువు నందు ఆనందించే మరికొన్ని విషయాలను గూర్చి ఆలోచించుడి. దేవుడు మనకు చేసే మంచి విషయాలు, ప్రేమ, రక్షించగలిగే శక్తిని జ్ఞాపకముంచుకొనుట ముఖ్యము. జీవితములో ఎదురయ్యే కష్టసమయాలలో ఈ విషయాలు మీకెలా సహాయపడగలవు?
2. దేవుని ప్రేమ, క్షమాపణ లేకుంటే దేవునికి మన విధేయతను చూపించలేము. యేసు రాకడ కొరకు ఎదురు చూచుచుండగా, ఈ వరాలు ఎందువలన ముఖ్యము? నిజముగానే మన మంచి ప్రవర్తన రక్షించలేదు. అదే సమయములో ఆయన నియమాలను ఆజ్ఞలను మనము ప్రేమించకుండా దేవునికి మనము విధేయులమై జీవించగలమా?

❋✶❋